క్లుప్తంగా

సోమవారం లోపు ఇంటి పన్ను చెల్లించండి

మున్సిపల్ ఆర్‌వో రాంప్రసాద్



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఇంటి, ఖాళీ స్థలం, నీటి పన్నులు చెల్లించాల్సిన వారు సోమవారం లోపు చెల్లించాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ కోరారు. తెనాలి పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పన్నుల చెల్లింపు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారుల సౌకార్యర్థం పట్టణంలోని శివాజీచౌక్, చెంచుపేట, స్వరాజ్‌టాకీస్ సెంటర్, లక్ష్మీ డీలక్స్ సెంటర్‌లలో తాత్కాలిక పన్నుల చెల్లింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పన్నులు చెల్లించాల్సిన వారు ఆయా కేంద్రాల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం పన్నుల వడ్డీపై 50శాతం రాయితీ ప్రకటించిందని గుర్తు చేశారు. ఒకేసారి పన్నులు చెల్లించి ప్రభుత్వం ఇచ్చిన రాయితీని ఉపయోగించుకోవాలని కోరారు.

కొనసాగుతున్న సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చ ఏసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకారం



తెనాలిరూరల్: రూరల్ సీఐగా ఆర్. ఉమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన తెనాలి పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో వన్ టౌన్ ఎస్ఐగానూ పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేశారు. నూతన సీఐకు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్ కుమార్, సిబ్బంది స్వాగతం పలికారు.

అభ్యాసన సామర్థ్యం మెరుగునకు చర్యలు

ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: విద్యార్థుల్లోని అభ్యాసన సమర్థ్యాన్ని మెరుగు పరిచేందుకు టీచ్ టుల్ దోహదపడుతుందని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబులు పేర్కొన్నారు. కొత్తపేటలోని మండల విద్యాధికారి కార్యాలయంలో టిచ్ టుల్ అబ్జవర్‌లతో గురువారం సమీక్ష జరిపారు. ప్రోగ్రామ్ అవశ్యకతను తెలియజేసి త్వరగా వారికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలియజేశారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

కొల్లిపరలో సీపీఎం ప్రజాచైతన్య యాత్ర

కొల్లిపర: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రను గురువారం నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. వ్యవసాయంలో వచ్చిన మార్పుల కారణంగా పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 350 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో రూ. 650 వస్తోందని చెప్పారు. కనీసం 300 రోజులు పనులు ఉండేలా చూడాలని ప్రజలు కోరారు. యాత్రలో ములకా శివసాంబిరెడ్డి, కోట చంద్రశేఖర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠపురం దేవస్థానానికి రూ.29.94 లక్షలు ఆదాయం

తెనాలిఅర్బన్: తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. ఏపీసీవోబీ బ్యాంకు, దేవస్థాన ఉద్యోగులు, స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు లెక్కింపులో పాల్గొన్నారు. మొత్తం రూ.29,58,479 లు మొక్కుబడుల హుండీలో కానుకగా వచ్చాయని, అన్నదాన హుండీలో రూ.35,780 వచ్చినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. మొత్తం 29,94,259లు కానుకల రూపంలో భక్తులు సమర్పించారన్నారు. ఇవి కాకుండా బంగారం 58 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, వెండి 218 గ్రాముల 600 మిల్లీ గ్రాములు వచ్చినట్లు వివరించారు. గతంలో జనవరి 17న లెక్కింపు జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈవో అన్నపూర్ణ పర్యవేక్షించారు.

సచివాలయాలకు కష్టకాలం

- నాలుగు నెలలుగా చెల్లించని అద్దెలు
- మున్సిపల్ కార్యాలయం నుంచి సీఎంఎఫ్ఎస్‌కు జమ
- అక్కడి నుంచి ఇంటి యజమానులకు విడుదల కానీ నిధులు
- ఖాళీ చేయాలని పలువురు యజమానుల ఒత్తిడి
- అయోమయంలో సచివాలయ ఉద్యోగులు



అద్దె భవనంలో ఉన్న 16వ వార్డు సచివాలయం

తెనాలిఅర్బన్: అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందాన తెనాలి పట్టణంలోని వార్డు సచివాలయాల పరిస్థితి తయారైంది. మున్సిపల్ కార్యాలయం నుంచి సీఎంఎఫ్ఎస్‌కు నిధులు జమ అయినా అక్కడి నుంచి చెల్లింపులు జరగలేదు. ఇలా నాలుగు నెలల నుంచి జరుగుతుండటంతో ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే తమ ఇళ్లను ఖాళీ చేయాలని సూచిస్తున్నారు. దీంతో ఏంచేయాలో తెలియక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

2019 అక్టోబర్ 2 నుంచి...

ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకు చేర్చాలనే ఉద్దేశంతో గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహనరెడ్డి వార్డు/ గ్రామ సచివాలయాలను 2019 అక్టోబర్ 2న రాష్ట్రంలో ప్రారంభించారు. రెండు వేల జనాభాకు ఒక సచివాలయంను ఏర్పాటు చేసి సచివాలయ ఉద్యోగులను నియమించారు. అలాగే ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

40 వార్డులు... 47 సచివాలయాలు

తెనాలి పట్టణంలోని జనాభా ఆధారంగా 47 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో 40 వార్డులు ఉన్నప్పటికీ కొన్ని వార్డులలో జనాభా ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ రెండు సచివాలయాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల వాటి సంఖ్య వార్డుల కంటే ఏడు అదనంగా పెరిగాయి. వీటిలో 25 సచివాలయాలను ప్రభుత్వ భవనాలలో ఏర్పాటు చేశారు. మిగిలిన 22 సచివాలయాలను ఆయా వార్డుల పరిధిలోని ప్రైవేట్ భవనాలలో ఏర్పాటు చేసి యజమానులకు చదరపు అడుగుకు రూ.8 చొప్పున అద్దె యజమానులకు చెల్లిస్తు వస్తున్నారు.

అద్దె పెంచరూ... చెల్లింపులు జరపరూ!

తెనాలి పట్టణంలోని 22 అద్దె భవనాలలో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాలకు నెలకు రూ.1.59లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అద్దెను ప్రతినెలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎఫ్ఎంఎస్‌కు జమ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం చెల్లింపులపై అంక్షలు పెట్టింది. దీంతో నాలుగు నెలల నుంచి అద్దెల చెల్లింపులు నిలచిపోయాయి. గతంలో ప్రతినెలా అద్దెలు జమయ్యేవని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు, అయిదు నెలలకు ఒకసారి చెల్లింపులు జరుగుతున్నాయని పలువురు ఇంటి యజమానులు ఆరోపిస్తున్నారు. అలాగే 2019లో రెండు సంవత్సరాల కాల పరిమితిపై అద్దెకు తీసుకున్నారు. ఆరు సంవత్సరాలు దాటినా నేటికీ ఒక్క రూపాయి కూడా అద్దెను పెంచలేదని వారు వాపోతున్నారు.

కానరాని నిబంధనలు

మున్సిపల్ నిబంధల ప్రకారం షాపు రూంల అద్దెలను మూడు సంవత్సరాలకు 33.33 శాతం పెంచుతుంటారు. ప్రభుత్వ భవనాల కోసం అద్దెకు తీసుకున్న వాటికి పదిశాతం పెంచాలనే నిబంధన ఉందని, ఆ దిశగా అధికారులు పెంచటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదిలేక ఇళ్లు ఖాళీ చేయాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి అద్దెను చెల్లించటంతో పాటు నిబంధనల ప్రకారం అద్దె పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని యజమానులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం



పట్టణంలో 22 సచివాలయాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వాటికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దెలు చెల్లించటం జరుగుతుంది. అద్దెల చెల్లింపులు డిసెంబర్ 2024 నుంచి నిలచినట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేసి త్వరగా చెల్లింపులు జరిగేలా చూస్తాం.

–బండి శేషన్న, కమిషనర్

కవిరాజా పార్కుకు మహర్దశ

- రూ.20 లక్షలతో పార్కు అభివృద్ధికి చర్యలు
- మహిళా జిమ్, చిన్నారులు ఆడుకునే ఆట వస్తువులు ఏర్పాటు

తెనాలిఅర్బన్: పురాతన పార్కుగా పేరొందిన తెనాలి నందులపేటలోని కవిరాజాపార్కు మహర్దశ పట్టింది. పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా వాకింగ్ ట్రాక్ ఆధునీకరణ, లేడీస్ జిమ్, పిల్లల ఆటవస్తువులు మరికొన్ని ఏర్పాటు, పెయింటింగ్‌లో లెవల్‌లో ఎర్రమట్టి ఏర్పాటు చేయడం వంటివి చేస్తున్నారు. దీని కోసం 15వ ఆర్థిక సంఘ నిధులను రూ.20 లక్షలు కేటాయించినట్లు ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. పనులు వారం క్రితం ప్రారంభమయ్యాయని, నెల రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. అభివృద్ధి పనుల కారణంగా నెల రోజుల పాటు పూర్తిగా మూసి వేశామని, ఆ ప్రాంత ప్రజలందరూ సహకరించాలని కోరారు.



నందులపేటలోని కవిరాజాపార్కు



ఆట వస్తువులు



పార్కులో ఆధునీకరిస్తున్న వాకింగ్ ట్రాక్, గ్రీనరీ

తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. 9వ వార్డులోని రేలంగి వారి వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 128 మీటర్ల రోడ్డును రూ.9.30 లక్షల నిధులతో నిర్మించనున్నట్లు చెప్పారు. దీని కోసం మున్సిపల్ జనరల్ ఫండ్‌ను కేటాయించినట్లు వివరించారు. అలాగే పట్టణంలోని అనేక రోడ్లు, కాల్వల నిర్మాణాలకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఈ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, జనసేన పార్టీ నాయకుడు సూరిశెట్టి భాస్కర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

కో ఆప్షన్ సభ్యుని ఎంపిక ఏకగ్రీవం

తెనాలిరూరల్: తెనాలి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుని ఎంపిక ఏకగ్రీవమైంది. స్థానిక కొత్తపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. నామినేషన్ సమయం ముగిసే నాటికి వైఎస్సార్‌సీపీ బలపర్చిన మండలంలోని తేలప్రోలు గ్రామానికి చెందిన సయ్యద్ జానీబాషా మాత్రమే నామినేషన్ వేశారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఇతర మద్దతుదారులతో కలసి నామినేషన్ పత్రాలు ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు అందజేశారు. సమయం ముగియడం, కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో జానీబాషా ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. కాగా కో ఆప్షన్ సభ్యుడైన షేక్ గాలిబ్ వ్యక్తిగత కారణాలతో గతేడాది జనవరిలో రాజీనామా చేశారు. దీంతో ఇప్పుడు ఎన్నిక నిర్వహించగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవమైంది.



నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ శివారెడ్డిని అభినందిస్తున్న సర్పంచ్ అరుణాబాయ్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జానీబాషా, ఎంపీపీ చెన్నకేశవులు

తూములూరు ఉపసర్పంచ్‌గా శివారెడ్డి

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఆరిమళ్ళ శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పంచాయతీ కార్యాలయం నందు ఎన్నిక ప్రత్యేక అధికారి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి అధ్యక్షతన గ్రామ సర్పంచ్ భూక్యా అరుణాబాయ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. 14 మంది వార్డు సభ్యులుగాను 13 మంది వార్డు సభ్యులు హాజరై పార్టీలకు అతీతంగా శివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ శివారెడ్డిని సర్పంచ్ అరుణాబాయ్, మాజీ ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, వార్డు సభ్యులు ఎంపీటీసీ సభ్యులు కూటమి నాయకులు అభినందించారు.

సమాజానికి వెలుగు చూపేది వృద్ధులే

- భారతీయ స్టేట్‌బ్యాంక్ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్
- శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమానికి రూ.2 లక్షల వనరుల పంపిణీ

తెనాలి: సమాజాన్ని వెలుగుబాటులో నడిపించేది వృద్ధులేనని, వారిని ఆదరించటం అందరి బాధ్యతగా భారతీయ స్టేట్‌బ్యాంక్ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్ అన్నారు. స్టేట్‌బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) పథకంలో భాగంగా గురువారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో ఫ్రిడ్జ్, ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్, గ్యాస్ స్టవ్, గ్రైండర్, దుప్పట్లు, చీరెలు, నిత్యావసర వస్తువులను జగదీష్‌కుమార్ పంపిణీ చేశారు. దాదాపు రూ.2 లక్షల విలువైన వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఆశ్రమవాసులకు సూచించారు. బ్యాంకింగ్ కార్యకలాపాల్లో ఉన్న స్టేట్‌బ్యాంక్ సమాజంలో వివిధ వర్గాలకు చేయూత నివ్వడంలో ముందువరసలో ఉంటుందన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం స్టేట్‌బ్యాంక్ అందించిన సాయానికి ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు స్వాగతం పలికారు. బ్యాంక్ అధికారి తిరుమలేశ్వరరావు వందన సమర్పణ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు చీరెలు, పండ్లు, దుప్పట్లను జగదీష్‌కుమార్‌తోపాటు చీఫ్ మేనేజర్లు నుపుమ్ ఘోష్, వెంకటేశ్వరరావు, జోనల్ సెక్రటరీ చంద్రశేఖర్ పంపిణీ చేశారు. రావిపాటి ప్రేమ్‌కుమార్, మణికంఠ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేస్తున్న జగదీష్‌కుమార్

యువ డాక్టర్లు సమాజ సేవ అలవరచుకోవాలి

ఎమెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలి టౌన్: యువ డాక్టర్లు ఆధునిక వైద్యంతో పాటు సమాజ సేవను అలవరచుకోవాలని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామంలో గురువారం చందు సుబ్బారావు స్మారక ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరు అస్టర్ రమేష్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఉన్నత చదువులు చదువుకొని గ్రామీణ ప్రాంతంలో మానసిక రోగులకు వైద్య సేవ చేస్తున్న చందు సుబ్బారావు కుటుంబ సభ్యులను అభినందించారు. వంశ పారంపర్యంగా వస్తున్న మానసిక రోగుల చికిత్సలయాన్ని కొనసాగించడం యువ డాక్టర్లకు ఆదర్శప్రాయమని తెలియజేశారు. డా.చందు హేమ పుట్టిన రోజు వేడుకను పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గుండె, జనరల్ మెడిసన్, ఆర్థో, దంత, ప్రసూతి విభాగాలకు సంబంధించిన వైద్యులు శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలందించారు. దాదాపు ఐదు వందల మంది ప్రజానీకం వైద్య శిబిరంలో పాల్గొని సేవలు పొందారు, వీరికి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందు హనుమంతు నాయక్, డా.సారంగి, డా.గీత, డా.రవీంద్ర గోపి, డా.భానుతేజ, డా.రిషి రాహుల్, డా.దీప్తి, డా. విశాల్ దేవ్, డా.సుస్మిత. డా.ప్రత్యుష, డా.సతీష్‌కుమార్, డా.సునీత, డా.చక్రవర్తి, డా,రవిశంకర్, కఠెవరం సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

తెనాలిరూరల్: తెనాలి బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. న్యాయవాదులు, కక్షిదారులకు సంబంధించి మరుగుదొడ్లు నిర్మించాలని, అలానే కోర్టు ప్రాంగణంలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, ఆఫీస్ బాయ్ వేతనం పెంచాలని, బార్ అసోసియేషన్‌కు కొత్త భవనం నిర్మించాలని సమావేశంలో తీర్మానం చేశారు. అలానే 2025–26 కాలానికి ప్రస్తుతం ఉన్న పాత కమిటీనే కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్; ఉపాధ్యక్షుడు అన్నం పిన్నారావు, సీనియర్ న్యాయవాదులు మామిడాల శ్రీనివాసరావు మధిర సురేష్, చదలవాడ శ్రీనాథ్, గజ్జా శ్రీనివాస్ గౌడ్, డి. మల్లికార్జున్ రెడ్డి, ఎంవీ సాంబశివరావు, షేక్ ఖాదర్ హుస్సేన్, దిండి శ్రీనివాస్, శంషేర్ బాషా, షేక్ బాషా, పిల్లి సుధాకర్, తలతోటి సుధాకర్, షేక్ రెహనా బేగం, దాసరి ఉమారాణి, గోన పుణ్యవతి పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ నసీమా బేగం

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించటం వల్ల అనేక అనర్థాలున్నాయని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ నసీమా బేగం, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై తెనాలి పురపాలక సంఘం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల సంయుక్త ఆధ్వర్యంలో ఉప్పు బజారులోని తాడిపర్తి అంజమ్మ కళ్యాణ మండపంలో గురవారం ఆవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 120 మైక్రాన్‌లలోపు మందం ఉన్న కవర్లు, వస్తువులను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని చెప్పారు. వాటిని ఉపయోగించటం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మలలు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాటిని విక్రయించవద్దని వ్యాపారులకు ఇప్పటికే సూచించినట్లు చెప్పారు. వాటిని విక్రయించిన, ఉపయోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని సూచించారు. సమావేశంలో పట్టణంలోని ప్లాస్టిక్ వ్యాపారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

ఉగాది రోజున సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ



తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో విశ్వావసునామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. దేవస్థానం సత్రం కమిటీ చైర్మన్ నూకల వెంకట వేణుగోపాలరావు పర్యవేక్షణలో పర్వదినాన జరిగే వేడుకల్లో ఆరోజుసాయంత్రం సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణం ప్రత్యేకంగా నిర్వహిస్తునట్టు ఆలయ సత్రం కమిటీ కార్యవర్గం వెల్లడించింది. గురువారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. పదకొండు వందల మంది ఏకకాలంలో హనుమాన్ చాలీసా పారాయణ చేస్తారని తెలిపారు. అనంతరం బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథశర్మచే పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉంటుందని, తదుపరి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. కమిటీ కార్యవర్గ సభ్యులు వుప్పల వరదరాజులు, గొడవర్తి సాయిహరే రామ్, నూకల భాస్కర్, సత్రం కమిటీ ఇన్చార్జ్ కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) :: TENALI
O.S. No. 237/2018
BETWEEN:
Vaddeswarapu Rajini Kanth ...Plaintiff
and
Pinapati Aruna (Died) & 7 Others ...Defendents
To
D2 to D7
1) Pinapati Syam Nana Rao C/o Sammyulu, Hindu, Aged about 77 years, Business
2) Pinapati Sarah Chandra S/o Syam Nana Rao, Hindu, Aged about 38 years, Business
3) Machi Sirisha Priya Darshini @ Sirisha, W/o Vasantha Kumar, Hindu, Aged about 36 years, House Wife
4) Pinapati Sandhya D/o Syam Nana Rao, Hindu, Aged about 35 years
5) Pinapati Chandra Sekhar S/o Syam Nana Rao, Hindu, Aged about 38 years
6) Pinapati Siddartha, S/o Syam Nana Rao, Hindu, Aged about 31 years
All are R/o Door No.5-16-7B, Itha Nagar, Tenali, Guntur District.
[illegible]
[illegible] 08-04-2025
[illegible]
బి. విజయకుమార్, డి. [illegible]
[illegible]

సుప్రసిద్ధ హార్మోనిస్టు దీపాల సుబ్రహ్మణ్యం హఠాన్మరణం

- నాటకంలో హార్మోనియం వాయిస్తూనే కుప్పకూలిన వైనం
- ప్రసిద్ధ నాటక సమాజం నిర్వాహకుడు
- పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కోశాధికారి

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు, రంగస్థల కళాకారుల సంఘం కోశాధికారి, శ్రీవిజయలక్ష్మి శ్రీనివాస నాట్యమండలి అధినేత దీపాల సుబ్రహ్మణ్యం (58) గురువారం మృతిచెందారు. చీరాల సమీపంలోని వేటపాలెంలో మంగళవారం రాత్రి నాటక ప్రదర్శనకు హార్మోనియం వాయిస్తుండగా, హఠాత్తుగా హార్మోనియంపైనే కుప్పకూలిపోయారు. అర్ధరాత్రి అక్కడ ఆసుపత్రికి తీసుకెళ్లి, ప్రాథమికచికిత్స చేయించారు. వైద్యుడి సూచనపై బుధవారం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయించినా ప్రయోజనం లేకుండాపోయింది. ఆయనకు భార్య, కుమారుడు వున్నారు. సుబ్రహ్మణ్యం స్వస్థలం భట్టిప్రోలు మండల గ్రామం ఐలవరం. యుక్తవయసులోనే నాటకకళలో ప్రవేశించారు. హార్మోనియం కళాకారుడిగా స్థిరపడ్డారు. తెనాలి వచ్చి, ఇక్కడే శ్రీవిజయలక్ష్మీ శ్రీనివాస నాట్యమండలిని స్థాపించారు. శ్రీతిరుపతమ్మ కథ, శ్రీబ్రహ్మంగారి చరిత్ర, శ్రీసాయిబాబా వంటి భక్తి రస ప్రధానమైన నాటకాలను సమాజం తరపున ఆడుతూ వచ్చారు. వ్యక్తిగతంగా కాకుండా ట్రూపుగా నడుపుతున్న ఏకైక కళాసంస్థగా గుర్తింపును పొందారు. నెలకు 25 చొప్పున కొన్ని వేల ప్రదర్శనలు ఆడారు. తెనాలికి తొలి నంది బహుమతులను తీసుకొచ్చిన ఘనతను సాధించారు. 2001 నంది నాటకోత్సవాల్లో శ్రీతిరుపతమ్మ కథ నాటకానికి ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ సంగీతం, ఉత్తమ నటి బహుమతులను అందుకున్నారు. పరిషత్‌ల్లో బహుమతులకు కొదవలేదు. సాయంత్రం తెనాలికి తీసుకొచ్చిన సుబ్రహ్మణ్యం భౌతికకాయాన్ని కళాకారులు, అభిమానుల సందర్శనార్థం బుర్రిపాలెంరోడ్డులోని రంగస్థల కళాకారుల సంఘ భవనంలో ఉంచారు. శుక్రవారంఅంత్యక్రియలు చేస్తామని కుమారుడు సాయినాథ్ తెలిపారు.



సమాజసేవతోనే నిజమైన ఆనందం



తెనాలి: విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులకు సమాజసేవకు మించిన సంతృప్తి, ఆనందం మరొకటి ఉండదనీ, ఆ సేవతోనే శరీరంలో సంతోషానికి సంబంధించిన హార్మోనులు విడుదల అవుతాయని ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక అసోసియేషన్ హాలులో ఏర్పాటైన సమావేశానికి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'వృద్ధులు–ఆనందం' అనే అంశంపై డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు ప్రత్యేక ప్రసంగం చేశారు. వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు అనేక ఆర్థిక, వ్యక్తిగత, కుటుంబ, మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారని గుర్తుచేశారు. శరీరంలో ఆనంద హార్మోనులు విడుదల కావాలంటే ప్రతిరోజూ క్రమంతప్పకుండా శారీరక వ్యాయామం చేయటం, కుటుంబ సభ్యులతో సంభాషించటం చేయాలన్నారు.